# తైబజారులో అక్రమ వసూళ్లు

- నేరడిగుంట సంతలో దోపిడీ
- తైబజారు పేరుతో రెట్టింపు ధరలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

**వట్‌పల్లి(అందోల్):** అందోల్ మండలంలోని నేరడిగుంట వారాంతపు సంతలో తైబజారు వసూళ్లను గుత్తేదారులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గ్రామ పంచాయతీ ద్వారా వేలం నిర్వహించి.. తైబజారు వేలంను దక్కించుకున్న వారు కూరగాయల విక్రయదారులు, చిరువ్యాపారులు, వాహనదారుల వద్ద పంచాయతీ అధికారులు నిర్ణయించిన రేట్లను వసూలు చేయాల్సి ఉండగా వారికి ఇష్టమొచ్చినట్లు రేట్లను పెంచి దోచుకుంటున్నారు. ఈ విషయాన్ని స్థానికులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ సంత ఏడాదిన్నర కిందట ప్రారంభమైంది. జోగిపేట, వట్‌పల్లి, అల్లాదుర్గం, పుల్‌కల్ మండలాల నుంచి రైతులు పండించిన కూరగాయలు, ఇతర వస్తువులను విక్రయించేందుకు ప్రతి బుధవారం నేరడిగుంట సంతకు తీసుకువస్తారు. 2024–25 సంవత్సరానికి తైబజారు వేలం పాటలు నిర్వహించగా కూరగాయల సంతకు రూ.2.02లక్షలు, మేకల సంతకు రూ.2.03 లక్షలు, పశువుల సంతకు రూ.23 వేలు మొత్తంగా రూ.4.28 లక్షల ఆదాయం వచ్చింది. కొద్ది నెలలుగా అధికారులు గుత్తేదారులతో కు మ్మక్కై ఈ వ్యవహారంపై పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆదాయంపై దృష్టి సారించిన అధికారులు సంతలో అధిక వసూళ్ల వైపు కన్నెత్తి చూడడం లేదని విక్రయదారులు వాపోతున్నారు. అందోల్‌లో జోగిపేట తర్వాత అతిపెద్ద సంత నేరడిగుంటలోనే జరుగుతుంది. జిల్లా పంచాయతీ అధికారులు అధిక వసూళ్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


నేరడిగుంట చౌరస్తాలో సంత



కూరగాయల విక్రయదారుడి వద్ద అధికంగా వసూలు చేసిన రశీదు

**రూ.20కు బదులుగా రూ.30 వసూళ్లు**

సంత ప్రారంభంలో నిర్ణయించిన ధరల ప్రకారం కూరగాయలు రూ.20 వసూలు చేయాల్సి ఉండగా రూ.30లకు పెంచి వసూలు చేస్తున్నారు. పెద్ద దుకాణదారుడి వద్ద రూ.50 వసూలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రెండవ పెద్ద సంత కావడంతో రైతులు, చిరువ్యాపారుల సంఖ్య పెరిగిపోయి వ్యాపారాలు వృద్ధి చెందాయి. దీంతో గుత్తేదారులు అధిక వసూళ్లపై కన్నేశారు. వీరి అక్రమ వసూళ్లకు మార్కెట్‌లో తైబజారు వసూళ్లకు సంబంధించి ధరల పట్టికను అందుబాటులో లేకపోవడంతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు.

> **నోటీసులు జారీ చేస్తాం**
>
> నిబంధనల ప్రకారమే తైబజారు వసూలు చేయాలి. పశువుల, కూరగాయల, మేకల సంతలకు సంబంధించి వేర్వేరుగా తైబజారు వసూలు రేట్లను నిర్ణయించాం. కూరగాయాల సంతకు రూ.20, పశువులకు రూ.100, మేకలకు రూ.50 చొప్పున విక్రయించాలని నిర్ణయించాం. అందుకు విరుద్ధంగా వసూలు చేసినట్లయితే గుత్తేదారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. త్వరలో సంతలో తైబజారు వసూళ్ల రేట్ల పట్టికను రైతులకు అందుబాటులో ఉంచుతాం.
>
> –నర్సింహస్వామి, పంచాయతీ కార్యదర్శి

## రోడ్డుపై పొంగిపొర్లుతున్న మురుగు నీరు

**రామచంద్రాపురం (పటాన్‌చెరు):** తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో మురుగు నీరు ఏరులై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో రోడ్డు వెంబడి ఉన్న వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేడియల్ రోడ్డు అనుకొని వర్షపు నీరు వెళ్లేందుకు కాల్వలు నిర్మించారు. కొంతమంది డ్రైనేజీ పైపులైన్‌లు కలపడంతో ఆ మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఈ విషయం అధికారులకు చెప్పిన వారు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుపై పారుతున్న మురుగు

## ఎండుతున్న పంటలను కాపాడండి

ఎన్‌ఆర్‌ఐ మశ్చేందర్


నల్లవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న మశ్చేందర్

**కల్హేర్(నారాయణఖేడ్):** జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు చివరి ఆయకట్టులో ఎండుతున్న పంటలను కాపాడేందుకు సాగునీరు అందించాలని ఎన్‌ఆర్‌ఐ, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సిర్గాపూర్ మండలం నల్లవాగు ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు చివరి ఆయకట్టు గ్రామలైన మార్డి, ఇందిరానగర్, కల్హేర్ శివారులో జొన్న, తదితర పంటలు ఎండుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి సరఫరాకు ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఆత్మ డైరెక్టర్ అనుముల మారుతి, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అందుబాటులో ఎరువులు

**సంగారెడ్డి టౌన్ :** మండలంలోని రైతులకు సాగుకు సరిపడ ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఝాన్సీలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో 3000 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఎటువంటి ఎరువుల కొరత లేదని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### భవన నిర్మాణానికి శంకుస్థాపన


మాట్లాడుతున్న దత్తగిరి మహారాజ్

**మునిపల్లి(అందోల్):** దత్తగిరి మహరాజ్ వైదిక పాఠశాల భవన నిర్మాణానికి ఆదివారం మంత్రి దామోదర రాజనర్సింహ్మ పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు వస్తున్నట్లు దత్తగిరి మహరాజ్ తెలిపారు. శనివారం దత్తగిరి మహారాజ్ మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం వైదిక పాఠశాల ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, బుదేరా మాజీ ఎంపీటీసీ మనోహర్ యాదవ్, మగ్దుంపల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

### అమరవీరులకు నివాళి

**జహీరాబాద్:** ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టిన ఆందోళనలో అసువులు బాసిన అమరవీరులకు ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్రహాం మాదిగ మాట్లాడుతూ.. మందక్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో 2009 ఫిబ్రవరి 28న గాంధీభవన్ వద్ద జరిగిన ఘటనలో సురేందర్, మహేశ్, దేవేందర్, ప్రభాకర్ మరణించిన రవి, కలెక్టరేట్ ముట్టడిలో ప్రాణాలర్పించిన భారతిల ప్రాణత్యాగం వెలకట్టలేనిదన్నారు.

## సుస్థిర అభివృద్ధిపై అవగాహన

**సంగారెడ్డి:** పట్టణంలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో 'సుస్థిర అభివృద్ధి' లక్ష్యాలపై శనివారం సైన్స్ ఫెయిర్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను అద్భుతంగా బుర్రకథ ద్వారా ప్రదర్శించారు. అలాగే, నీటి ఆవశ్యకతను నాట్యం ద్వారా ప్రదర్శించారు. విద్యార్థులంతా ఒక్కొక్క లక్ష్యం గురించి ప్రాజెక్టులు చేసి ప్రదర్శించారు. అతిథులకు, తల్లిదండ్రులకు విద్యార్థులకు చక్కగా వివరించారు. విద్యార్థులు చేసిన ప్రాజెక్టులు, వివరించి చెప్పే విధానం వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల చైర్మన్ ఈదర ఆంథోనీరెడ్డి, ఈ అభ్యాస్ అకాడమీ వ్యవస్థాపకులు ఫణిపవన్, లీడ్ అకాడమీ సభ్యులు దినేష్‌రెడ్డి, కరస్పాండెంట్ రవికుమార్‌రెడ్డి , అకాడమిక్ సలహాదారులు రూబెన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు

## మసీద్‌ల వద్ద సదుపాయాలు కల్పించండి

**నారాయణఖేడ్:** రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని ఆదివారం నుంచి వచ్చేనెల (ఏప్రిల్) 2 వరకు అన్ని మసీద్‌ల వద్ద వసతులను కల్పించాలని ఖేడ్ ముస్లిం యాక్షన్ కమిటీ కోరింది. ఆర్డీఓ అశోక చక్రవర్తి, తహసీల్దార్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులకు శనివారం వేర్వేరుగా కమిటీ బాధ్యులు వినతిపత్రాలను అందజేశారు. మసీదుల వద్ద 24 గంటల పాటు విద్యుత్తు సరఫరా, వీధిదీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, పోలీసు పెట్రోలింగ్, రాత్రి వేళ్లల్లో హోటళ్లు తెరచిఉంచి, ఇఫ్తార్ సమయాల్లో వాహనాలకు జరిమానాలు విధించకూడదని పేర్కొన్నారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో కార్య ముస్లిం యాక్షన్ కమిటీ అధ్యక్షుడు మైనొద్దిన్ ఖురేషి, ప్రధాన కార్యదర్శి తాహెర్‌అలీ మదీనా, ఇతర బాధ్యులు గౌస్‌చిస్తీ, యూనూస్, హఫీజ్, మాజీద్‌అలీ, మొయిన్, షఫీఖురేషి, హకీం, అబ్దుల్లా తదితరులు ఉన్నారు.


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న బాధ్యులు

## కాల్వల మరమ్మతులు చేపట్టాలి

**వట్‌పల్లి(అందోల్):** మండలంలోని అల్మాయిపేట పెద్ద చెరువులోకి సింగూరు నీటి కాల్వల ద్వారా వ్యవసాయానికి నీరు అందించాలని అందోల్ మండలంలోని అల్మాయిపేట రైతులు శనివారం తహసీల్దార్ విష్ణుసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువులోకి వచ్చే సింగూరు నీటి కాల్వలను సంగుపేట గ్రామస్తులు మార్గమధ్యలో ధ్వంసం చేసి గ్రామానికి సాగునీరు రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు, తహసీల్దార్‌లకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సింగూరు నీళ్లు రాకపోవడంతో వ్యవసాయం చేస్తున్న రైతులందరూ పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి రావడంతో బోర్లలో నీళ్లు కూడా ఎండిపోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో రైతులు మొగులయ్య, అశోక్, దుర్గాప్రసాద్, అనిల్, రాములు, నర్సింలు, నారాయణ, బీరప్ప, దావీద్, ఆంజనేయులు, శంకరయ్య పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

## ఘనంగా స్వయంపాలన దినోత్సవం


కార్యక్రమంలో ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

**న్యాల్‌కల్(జహీరాబాద్):** మండలంలోని హద్నూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఎంఈఓ మారుతి రాథోడ్, హెచ్‌ఎం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మునిపల్లి(అందోల్):** మండలంలోని అంతారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. తోటి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు పదవీ బాధ్యతలు ఎలా నిర్వహిస్తారో తెలియజేశారు. కార్యక్రమంలో గాయత్రి, దీవెన , విజయలక్ష్మి, ముస్కాన్, నవీత, శ్రావణి, ధనుష్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సేవ్ మంజీరా..

మనిషి మనుగడకు జీవనాధారమైన నీటిని సంరక్షించాలని, ప్లాస్టిక్ భూతం నుంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని పర్యావరణ ప్రేమికుడు జ్ఞానేశ్వర్ సంగారెడ్డి జిల్లా శివ్వంపేట మంజీరా బ్రిడ్జి వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేశారు. నది ఆవరణలో ఉన్న కవర్లు, బాటిళ్లను ఏరి.. నదిలోని నీళ్ల ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోకుండా సహకరించాలని పరివాహక ప్రాంత ప్రజలను కోరారు.

– సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



మంజీరా బ్రిడ్జి వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న జ్ఞానేశ్వర్

## ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న అక్తర్ అహ్మద్ తదితరులు

**జహీరాబాద్ టౌన్:** ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం)పార్టీ 68వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అతిథి గృహం వద్ద జహీరాబాద్ అధ్యక్షుడు అత్తర్ అహ్మద్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలవారికి సంక్షేమం, న్యాయం కోసం ఎంఐఎం పాటు పడుతుందన్నారు. అంబేడ్కర్ ఆశయాలతో పార్టీ ముందుకు సాగుతుందన్నారు. పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు జహీరాబాద్‌లో పార్టీని పటిష్టం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అజ్మత్ పాష, నాయకులు మోహియోద్దీన్ ఘోరీ,షేక్ రఫీ, అమెర్‌బిన్ అబ్దుల్లా, ఇలియాస్, షేక్ సద్దాం పాల్గొన్నారు.

## మూగజీవుల రక్షణే లక్ష్యం

అనిమల్ వారియర్స్ కన్సర్వేషన్ సొసైటీ

**జిన్నారం (పటాన్‌చెరు):** జిన్నారం మండలానికి చెందిన రైతు గవిండ్ల రంగారెడ్డి వ్యవసాయ క్షేత్రంలోని బావిలో వారం రోజుల క్రితం ఓ వీధి కుక్క పడిపోయింది. బావిలోతుగా ఉండడంతో ఆ కుక్క పైకి రాలేకపోయింది. తినడానికి ఆహారం లేక అలమటించింది. విషయాన్ని గమనించిన రైతు పైకి తెచ్చే ప్రయత్నం చేసిన ఫలించలేదు. దీంతో ప్రతిరోజు ఆ రైతు బ్రెడ్డు వివిధ ఆహార పదార్థాలు బావిలో వేయడంతో వాటిని తిని బావిలోనే తిరుగుతూ ఉంది. విషయం మేడ్చల్‌కు చెందిన ×అనిమల్ వారియర్స్ కన్సర్వేషన్ సొసైటీ ప్రతినిధులకు తెలియడంతో శుక్రవారం బావివద్దకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టి కుక్కను సురక్షితంగా బయటకు తీశారు. దీంతో ఆ కుక్క ఊపిరి పీల్చుకుంది. రైతు రంగారెడ్డి సైతం ఆనందం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా అనిమల్ వారియర్స్ కన్సర్వేషన్ సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


కుక్కను కాపాడిన సొసైటీ సభ్యులు

## హాస్టల్ విద్యార్థులకు అండగా టీఎన్జీవోస్

**సంగారెడ్డి రూరల్ :** హాస్టల్ విద్యార్థులకు ఎల్లప్పుడు టీఎన్జీవోస్ సంఘం అండగా ఉంటుందని జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు ఎండీ జావిద్ అలీ తెలిపారు. శనివారం పదవ తరగతి విద్యార్థుల ప్రేరణ, శిక్షణ తరగతులను సందర్శించారు. వసతి గృహ సంక్షేమ అధికారులకు ఎలాంటి కష్టమొచ్చిన టీఎన్జీవోస్ సంఘం ముందుండి పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవో సెక్రటరీ రవి, అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, జిల్లాలో ఉన్నటువంటి వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఉమాదేవి షెట్కార్

**నారాయణఖేడ్:** సీఎం సహాయనిధి నుంచి పలువురు లబ్ధిదారులకు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరైంది. ఎంపీ సురేష్ షెట్కార్ సూచన మేరకు అల్లీపూర్ గ్రామానికి చెందిన మహేష్‌కు రూ.50 వేలు, అబ్బెందకు చెందిన శంకర్‌కు రూ.1.50 లక్షలు, కృష్ణాపూర్‌కు చెందిన కిష్టయ్యకు రూ.2.50 లక్షల చెక్కులను శనివారం ఎంపీ సురేష్ షెట్కార్ కుటుంబ సభ్యులు అందజేశారు.

### సమయానుకూలంగా బస్సులు నడపాలి


డీఎం మల్లేశయ్యకు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ బాధ్యులు

**నారాయణఖేడ్:** ఆర్టీసీ డిపో బస్సులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ఖేడ్ డిపో మేనేజర్‌కు మల్లేశయ్యకు శనివారం ఏబీవీపీ నగర కార్యదర్శి శంకర్, ఇతర బాధ్యులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ఇంటర్మీడియెట్, పదోతరగతి పరీక్షా కేంద్రాలు జరుగుతున్నందునగ్రామాల నుంచి పరీక్షలు రాయడానికి విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తారని తెలిపారు. డిపోలో బస్సుల కొరత ఉంది. కావున బస్సుల్లో రద్దీ సమస్య ఉండి బస్సులు ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బస్సులు సమయానుకూలంగా నడపాలని కోరారు.

### సెల్‌టవర్ ఏర్పాటు వద్దు


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

**జహీరాబాద్:** పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలో సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపేయాలని కాలనీవాసులు అధికారులను కోరా రు. ఈ క్రమంలో శనివారం ఆర్డీఓ రాంరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నివాస ప్రాంతాల్లో సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణం పనులు ఆపేయాలన్నారు.

### ఆలయ హుండీ లెక్కింపు


నగదును లెక్కిస్తున్న సిబ్బంది

**పటాన్‌చెరు:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ హుండీని శనివారం లెక్కించారు. మహాశివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.47,99,283 వచ్చిందని ఆలయ ఈఓ శశిధర్, ఆలయ కమిటీ చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్ తెలిపారు. దేవాదాయ శాఖ స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కొనసాగింది. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్‌యాదవ్, ఈఓ శశిధర్‌గుప్తా మాట్లాడుతూ.. వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ రెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

### జాతరకు ఆహ్వానం


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గ్రామస్తులు

**జిన్నారం (పటాన్‌చెరు):** గడ్డపోతారం మున్సిపాలిటీలో ఈ నెల 9న నిర్వహించనున్న కట్ట మైసమ్మ జాతరలో ముఖ్యఅతిథిగా పాల్గొనాలని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధనరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెంటేష్, కుమార్, దేవయ్య, బాలయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### బాధిత కుటుంబానికి నష్టపరిహారం

**జిన్నారం (పటాన్‌చెరు):** బొల్లారం మున్సిపాలిటీ శివారులోని శ్రీ శక్తి ఎలక్ట్రానిక్స్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో కృష్ణారావు అనే కార్మికుడు గత కొన్ని ఏళ్లుగా పనిచేస్తున్నాడు. ఇటీవల పరిశ్రమలో గుండె పోటు రావడంతో మృతి చెందాడు. పరిశ్రమ యాజమాన్యం కుటుంబానికి న్యాయం చేయకపోవడంతో భార్యాపిల్లలు బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత రవిసింగ్‌ను ఆశ్రయించారు. ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి కుటుంబానికి నష్టపరిహారం రూ.9 లక్షల చెక్కు అందించేలా కృషి చేశారు. ఆపద సమయంలో అండగా నిలిచిన నాయకులకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుండ్ల మహేందర్‌రెడ్డి, ఆనంద్ రెడ్డి, జగన్, కిరణ్ పాల్గొన్నారు.

### పదికి పది జీపీఏ సాధించాలి

**న్యాల్‌కల్(జహీరాబాద్):** పదవ తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని హెచ్‌ఎం సచ్చిదానందరెడ్డి సూచించారు. శనివారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో పది విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పదిలో ప్రతి ఒక్కరు పదికి పది జీపీఏ సాధించాలన్నారు. ఉన్న కొద్ది సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికబద్ధంగా చదువుకొని మంచి మార్కులు తెచ్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదం.. గంట ట్రాఫిక్ జామ్




**హత్నూర( సంగారెడ్డి):** హత్నూర మండలం మంగాపూర్ బస్టాప్ వద్ద ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాలీ ఆటో మంగాపూర్ గ్రామం నుంచి నర్సాపూర్ వెళ్లేందుకు ఆ గ్రామ బస్టాప్ వద్ద మళ్లుతుండగా దౌల్తాబాద్ వైపు నుంచి నర్సాపూర్ వెళ్తున్న ట్యాంకర్ (లారీ) బలంగా ఢీ కొట్టింది. ఆటో రోడ్డుపై బోల్తాపడగా, నర్సాపూర్ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు అదే ఆటోను ఢీకొట్టింది. ఆటో నుజ్జు నుజ్జు కాగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఒక్కసారిగా సంగారెడ్డి నర్సాపూర్ రోడ్డుపై రాకపోకలు స్తంభించి సుమారు గంటపాటు ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

### వేతనాలు చెల్లించాలని వినతి

**జహీరాబాద్ టౌన్:** వేతనాల సకాలంలో చెల్లించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు శనివారం జాయింట్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్(సీఐటీయూ)జిల్లా ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి మాట్లాడుతూ.. రెండు నెలల వేతనాలు రావాల్సి ఉండగా పోరాటం చేయడంతో ఒక నెల జీతం ఇచ్చారని చెప్పారు. ఇంకా జనవరి నెలకు సంబంధించిన వేతనం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అధికారులు చొరవ తీసుకుని వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ డైరెక్టర్ కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్, యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి నాగలక్ష్మి, జగదాంబ, సబితా, అంజమ్మ, నాగమణి, బుజ్జమ్మలు పాల్గొన్నారు.

### రేపటి నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

**నారాయణఖేడ్:** పట్టణ శివారులోని భక్త మార్కండేయ మహా దేవాలయం నిర్మాణం పనులు పూర్తయ్యాయి. 3 నుంచి 6 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి, వివిధ మఠాధిపతులు పాల్గొననున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.